క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం

వరికుంటపాడు: మండలంలోని తూర్పుకొండా రెడ్డిపల్లెలో నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోదండరామస్వామి ఆలయంలో వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు స్వామి వార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాలతో కల్యాణ వేదికకు తీసుకువచ్చి ఆశీనులను చేశారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని కమనీయం, రమణీయంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆదివారం వసంతోత్సవం, పార్వేట కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

వడ్డెర సంక్షేమ సంఘం కార్యవర్గం ఎంపిక



కావలి: కావలి వడ్డెర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన వడ్డెర సంక్షేమ సంఘం సమావేశంలో నూతన అధ్యక్షుడిగా చల్లా లక్ష్మీరావును, మరో తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చోరీ ఘటనలో కీలక ఆధారాలు లభ్యం

కావలి: పట్టణంలోని బృందావనం కాలనీలో కలకలం సృష్టించిన చోరీ ఘటనలో పోలీసులు పురోగతి సాధించినట్లుగా తెలిసింది. కట్టుదిట్టమైన భద్రత ఉండే బృందావనం కాలనీలో ఈ నెల 16వ తేదీన భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. సెక్యూరిటీ గార్డులు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండే బృందావనం కాలనీలో, ఇంట్లో మనుషులు ఉండగానే దొంగలు చోరీ చేసి పారిపోవడంతో స్థానికంగా సంచలనం సృష్టించింది. జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ కూడా ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. తాజాగా చోరీకి పాల్పడిన అనుమానితులకు సంబంధించిన సీసీ ఫుటేజీ లభించినట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈ సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రత్యేక పోలీసు బృందం క్షేత్రస్థాయిలో దర్యాప్తును ముమ్మరం చేసినట్లుగా తెలిసింది. చోరీ ఘటనను పోలీసులు ఛాలెంజింగ్‌గా తీసుకోవడంతో దర్యాప్తులో కీలక విషయాలు వెలుగుచూస్తున్నట్లుగా తెలిసింది.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



వింజమూరు (ఉదయగిరి): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు వింజమూరు మండల వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ కన్వీనరు లెక్కల సుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని శంఖవరంలో జగనన్నే ఆ భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదలందరికీ నాలుగేళ్లుగా ఆర్థిక భరోసా ఇచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనరు వెంకట నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణం, చినపెంచలయ్య, పేతురు, తదితరులున్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

చేజర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని చేజర్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు శనివారం పాడేరు సచివాలయ పరిధిలోని చీర్లవారికండ్రికలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం సంక్షేమ పథకాల వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈ సురేష్, పుల్లయ్య, సచివాలయ ఉద్యోగులు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



చేజర్ల: గడ్డి లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ విద్యుత్ ఘాతానికి గురై గడ్డి పూర్తిగా దగ్ధమైన ఘటన చేజర్ల బస్టాండ్‌లో శనివారం జరిగింది. గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ తీగలకు తగలడంతో మంటలు చెలరేగాయి. గడ్డి పూర్తిగా కాలిపోయి ట్రాక్టర్ పాక్షికంగా దగ్ధమైంది. బస్టాండ్ సెంటర్‌లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల వల్లే ప్రమాదం జరుగుతుందని స్థానికులు అంటున్నారు.

ఈద్-ఉల్-ఫిత్ర్

• ఘనంగా రంజాన్ పండగ



ఆత్మకూరు: ఈద్గా మైదానంలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని ఈద్గా మైదానంలో పవిత్ర రంజాన్ పురస్కరించుకుని ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత పట్టణంలోని సత్రం సెంటర్ వద్దకు పలు ప్రాంతాల నుంచి చేరుకున్న ముస్లింలు అక్కడి నుంచి ప్రదర్శనగా బీఎస్సార్ సెంటర్‌లోని ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ముతవల్లిలు ఖురాన్‌లోని పవిత్ర సూక్తులను ప్రవచించారు. రంజాన్ మాస విశిష్టతను, ఉపవాస దీక్ష పవిత్రతను తెలిపారు. పేదరికం గురించి తెలియజేయడానికే ఈ ఉపవాస దీక్షలని సందేశమని వెల్లడించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరిని ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పవిత్రతకు ప్రతీక రంజాన్

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల రోజుల కఠోర నియమాలను పాటిస్తూ ఉపవాసం చేస్తూ నిర్దిష్ట వేళల్లో ఆహారం తీసుకుంటూ పవిత్రతకు ప్రతీకగా రంజాన్ మాస ఉపవాప దీక్ష పూర్తి చేయడం గొప్ప విషయమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఈద్గా మైదానంలో నిర్వహించిన రంజాన్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనకు స్థానిక ముస్లింలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలకు పెద్ద పండగ రంజాన్ అని, చిన్నా, పెద్దా భేషజం లేకుండా ఉపవాసాన్ని చేయడం గొప్ప విషయమన్నారు. ముస్లింలు వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ మహబూబ్‌బాషా, సయ్యద్ జమీర్, రిజ్వాన్, కలాం, రహీం, వసీం, ముజీబ్, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ఐవీ రమణారెడ్డి, పలువురు ముస్లిం మైనార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊరూరా రంజాన్ సంబరాలు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని కరటంపాడు, బొటికర్లపాడు, మహిమలూరు, దేపూరు, అశ్వనీపురం, నబీనగరం, నల్లపరెడ్డిపల్లి, అప్పారావుపాళెం, వాశిలి తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను శనివారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈద్గాలు, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ పర్వదినం వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పడమటినాయుడుపల్లి, పల్లవోలు, అల్లంపాడు, మర్రిపాడు, చిలకపాడు, పెగళ్లపాడు, సింగనపల్లి, నాగినేనిగుంట, కృష్ణాపురం, ఏపిలగుంట, కదిరినేనిపల్లి, నందవరం, పొంగూరు తదితర గ్రామాల్లోని ముస్లింలు దర్గాలు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సంబరంగా రంజాన్

చేజర్ల: మండలంలో శనివారం రంజాన్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదూరుపల్లి, ఉలవపల్లి, చేజర్ల మసీదుల్లో నమాజ్ అనంతరం ప్రత్యేక దువా నిర్వహించి అల్లాను ప్రార్థించారు. చేజర్లలో జామియా మసీదులో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సిరాజుద్దీన్, ముస్లిం యువ నాయకులు షేక్ నజీర్, షేక్ రసూల్, షేక్ ఖాజా మసీర్, షేక్ దావూద్, షేక్ సర్దార్, షేక్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అనంతసాగరం, సోమశిల, ఉప్పలపాడు, ముస్తాపురం, పాతదేవరాయపల్లి గ్రామాల్లోని ఈద్గాల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. నెల రోజుల పాటు దైవ ప్రార్థనలతో ఉపవాసాలు ఉండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రంజాన్‌ను జరుపుకొన్నారు.



ఆత్మకూరురూరల్: బొటికర్లపాడులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



అనంతసాగరం: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సంగం: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా రంజాన్ వేడుకలు

సంగం: మండలంలోని సంగం, తరుణవాయి, సిద్దీపురం, తలుపురుపాడు, కొరిమెర్ల, దువ్వూరు తదితర ప్రాంతాల్లో ముస్లింలు అంతా శనివారం ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. స్నేహితులకు విందు ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్

అనుమసముద్రంపేట: మండలంలో రంజాన్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏఎస్ పేట, అనుమసముద్రం, హసనాపురం, రాజవోలు, గుడిపాడు, గ్రామాల్లో మసీదుల వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. దర్గా వద్ద పోలీసుల బందోబస్తు నడుమ రంజాన్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకొన్నారు. సంగం సీఐ రవినాయక్, ఎస్ నాగార్జునరెడ్డి, ఏఎస్‌పేట ఎస్సై నరేష్ దర్గా వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రత కల్పించారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో సంతోషం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో సంతోషం వెల్లివిరుస్తుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణం 38వ వార్డులో ఎమ్మెల్యే శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికి తిరిగి మూడేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కావలి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమల స్థాపనకు తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన సాయాన్ని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ, పక్కా ఇళ్ల నిర్మాణం, ఆసరా ద్వారా మహిళలకు సాయం, రైతు భరోసా, ఆర్బీకేల నిర్మాణం, అమ్మఒడి తదితర పథకాల ద్వారా పేదల జీవితాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తీరని నష్టం



పెగళ్లపాడులో కురిసిన అకాల వర్షానికి తడిచిన వరి ఓదెలు



ట్రాక్టరుపై విరిగిపడిన చెట్టు



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టుకొమ్మలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని ఉమ్మాయిపల్లి, పెగళ్లపాడు, రాజులపాడు గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. వరి కోతలు కోసి ఉన్న దశలో చేలల్లో ధాన్యం ఆరబెట్టుకొని ఉన్న రైతులు ఒక్కసారిగా కురిసిన వర్షానికి స్థానిక రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని వాపోయారు.

వర్ష బీభత్సవం

ఉదయగిరి: ఉదయగిరి ప్రాంతంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు గాలుల ధాటికి చెల్లా చెదురయ్యాయి. కుర్రపల్లిలో గాలులకు వేపచెట్టు ట్రాక్టరుపై పడింది. సర్వరాబాదులో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో చెట్లు రోడ్డుకు అడ్డుగా పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గాలుల కారణంగా మామిడికాయలు నేలరాలాయి. కల్లాల్లో ఉన్న పచ్చి ఇటుక బట్టీలు తడిసి పోవడంతో యజమానులు లబోదిబోమంటున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ పండగ



ఉదయగిరి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వరికుంటపాడు: తిమ్మారెడ్డిపల్లెలో..

ఉదయగిరి: మండలంలోని ముస్లింలు రంజాన్ పండగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజుల పాటు కఠోర నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ రంజాన్ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉదయగిరితో పాటు మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, మాసాయిపేట, దాసరపల్లి, బోడబండ, బిజ్జంపల్లి, జి.అయ్యవారిపల్లి గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈద్గాల వద్ద సీఐ గిరిబాబు, ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంబరంగా రంజాన్

వరికుంటపాడు: ముస్లింల పవిత్ర రంజాన్ పండగను శనివారం పలు గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో సంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని ఈద్గాల వద్దకు వెళ్లి దువా నిర్వహించారు. మండలంలోని వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, పెద్దిరెడ్డిపల్లి, తోటల చెరువుపల్లి, బోయమడుగుల, విరువూరు గ్రామాల్లో రంజాన్ పర్వదినం జరుపుకున్నారు.

ఘనంగా రంజాన్ పండగ

దుత్తలూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సమీప ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని దుత్తలూరు బీసీ కాలనీ, నర్రవాడ, ఏరుకొల్లు, బ్రహ్మేశ్వరం, నందిపాడు తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఊరూరా రంజాన్ వేడుకలు

జలదంకి: మండలంలో శనివారం ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. బీకే అగ్రహారం, జలదంకి, జమ్మలపాళెం, సోమవరప్పాడు, అన్నవరం, చోడవరం తదితర గ్రామాల్లో మసీదుల వద్ద ప్రత్యేక నమాజులు చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. జలదంకి ఈద్గా వద్ద కలిగిరి సీఐ సాంబశివరావు, జలదంకి ఎస్సై వీరేంద్రబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గా మైదానంలో ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజుల్లో పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక మసీదుల్లో ప్రత్యేక పార్థనలు, నమాజులు చేశారు. కొమ్మి, కొండాపురం, ఎర్రబల్లి, వెంకటరంగాపురం తదితర గ్రామాల్లో ముస్లింలు ఈ వేడుకలను కోలాహలంగా జరుపుకున్నారు.

భక్తిగా రంజాన్ పర్వదినం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో శనివారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వింజమూరు బంగ్లా సెంటర్‌లోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పవిత్రతను మతపెద్దలు వివరించారు. సీఐ సాంబశివరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

సీతారామపురం: మండలంలోని సీతారామపురం, తురకపాళెం, గంధంవారిపల్లి, సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, రంగనాయుడుపల్లి, బసినేనిపల్లిలో ముస్లిం సోదరులు శనివారం ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

కలిగిరి: మండలంలోని కలిగిరి, పెద్దపాడు, ద్రాకుటూరు, అనంతపురంలోని మసీదుల్లో ముస్లింలు శనివారం రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరొకొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్నేహితులు, బంధువులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేసి సంతోషాన్ని పంచుకున్నారు.

రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

అల్లూరు: మండలంలో రంజాన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరులోని జామియా మసీద్, బీసీ కాలనీలోని మదీనా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు మాట్లాడుతూ ఏ మతానికి చెందిన పండగైనా దాని వెనుక ఒక సందేశం దాగి ఉంటుందని, నిజానికి మానవాళి హితాన్ని ఆకాంక్షించే సందర్భమే రంజాన్ పండగని చెప్పారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండగన్నారు. ఈ వేడుకల్లో ఇమామ్‌లు అజ్మల్, మసీద్ ప్రెసిడెంట్లు షేక్ సమద్, షేక్ అకూర్, ముతవళి షేక్ ఉస్మాన్ షరీఫ్, ముస్లిలు షేక్ ఇస్మాయిల్, షేక్ రంతుల్లా, షేక్ బాబు, పి గౌస్‌ఖాన్, షేక్ జంషీర్, షేక్ షన్న, సాబీర్, మసూద్, షబ్బీర్ పాల్గొన్నారు.



వింజమూరులో..



సీతారామపురం: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మదీనా మసీద్‌లో పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింల



దుత్తలూరు: ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు



జలదంకి: ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజు చేస్తున్న సీఐ సాంబశివరావు



కలిగిరి: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఈ నెల 26న మాజీ ఉప రాష్ట్రపతితో ఆత్మీయ కలయిక

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణానికి ఈ నెల 26వ తేదీ రానున్న భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుతో ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్లు మరుపురాని రీతిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో మాజీ ఉప రాష్ట్రపతితో ఆత్మీయ కలయిక ఏర్పాట్లపై శనివారం బీజేపీతో కూడిన అఖిలపక్ష నాయకులు సమావేశం నిర్వహించారు. అదే రోజు సాయంత్రం మాజీ ఎమ్మెల్యే దివంగత బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి కాంస్య విగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, సీహెచ్ రమణయ్యనాయుడు, గూటూరు కన్నబాబు, సీహెచ్ వెంకట సుబ్బానాయుడు, కె సుధాకర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న అఖిలపక్ష నాయకులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



త్రిసభ్య కమిటీని ప్రకటించిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక అల్లూరు పడమర ప్రాథమిక సహకార పరపతి సంఘం సొసైటీ నూతన పాలకవర్గ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. త్రిసభ్య కమిటీలో చైర్‌పర్సన్‌గా బత్తుల భక్తవత్సలరెడ్డి, పర్సన్‌లుగా దాసరి వెంకటరమణయ్య, చింతం మాధవ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పాలకవర్గ సభ్యులు మండలంలోని రైతులకు అందుబాటులో ఉండి తమ సేవలను అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కో-ఆపరేటివ్ సొసైటీలు, రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు అండగా ఉంటాయన్నారు. అల్లూరు మండలంలో రెండో పంటకు నీరు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, ఎంపీపీ శశిరేఖ, వైస్ ఎంపీపీ సురేంద్ర, మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ షేక్ ఉస్మాన్ షరీఫ్, నాయకులు నీలం సాయికుమార్, పవన్‌రెడ్డి, దైవాదీనం, సాధక్ రెడ్డి, మేడా మాధవ్, దాసరి పోలయ్య, చెంతాటి కరుణాకర్, సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



నల్లపరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లపరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.3 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, తోటపల్లి రవికుమార్ రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యర్రగుంట పెంచలయ్య, పంచాయతీ వార్డు మెంబర్లు పెండెం పెంచలమ్మ, ఉదయగిరి పెంచలయ్య, గృహసారథులు అనూష, బాలకృష్ణ, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండాపురం: మండలంలోని గరిమెనపెంట వద్ద ఉన్న ఉప్పుటేరు వాగు నుంచి వింజమూరు మండలానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శనివారం కొండాపురం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై షేక్ ఖాజావలి సమాచారం మేరకు.. వింజమూరు మండలానికి చెందిన కామాక్షయ్య ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందిని పంపించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.